క్లుప్తంగా

ఘనంగా గ్రామోత్సవం



పూనూరులో ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యద్దనపూడి: మండలంలోని పూనూరులో వేంచేసి ఉన్న త్రిపుర సుందరి సమేత త్రిపురాంతక స్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి వార్ల గ్రామోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్వామివార్ల కల్యాణం అనంతరం బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఉత్సవరులను ప్రత్యేక వాహనంలో ఆసీనులను చేసి మంగళవాయిద్యాలు , వేదమంత్రాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వార్లు పోసి మంగళ హారతులు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు మూలంరాజ్ రాజ్‌కుమార్ శర్మ, ఆలయ ఈఓ మల్లవరపు నాగయ్య, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బత్తుల ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.37 కోట్లు పంట నష్టం

బల్లికురవ: ప్రభుత్వం రబీలో తుఫాన్‌కు పంటలు దెబ్బతిన్న 1866 మంది రైతులకు రూ. 1.37 కోట్లు పరిహారం మంజూరు చేసిందని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి బుధవారం తెలిపారు. పొగాకు, మొక్కజొన్న, వరి దెబ్బతిన్న రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా సొమ్ము ప్రభుత్వమే జమ చేస్తుందని వివరించారు. 2023 డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు సంబంధించి అప్పట్లో ఎన్యూమరేషన్ టీం నష్టపోయిన రైతులు జాబితాలు తయారు చేసినట్లు చెప్పారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

చీరాల టౌన్: మండలంలో ఉన్న ఏగ్రామంలోనైనా ఒక్కరైనా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని, రోజువారీగా గ్రామాలను సందర్శిస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. బుధవారం పీహెచ్‌సీలోని వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలతో వైద్యులు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో నివాసముంటున్న ప్రజలకు వేసవిలో ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా అవగాహన కల్పిస్తూ అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి వైద్యసేవలను సక్రమంగా అందించాలన్నారు. అలానే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ప్రజలను చైతన్య వంతులుగా చేయాలన్నారు. రోగాల బారిన పడిన రోగులకు కావాల్సిన మందులను, ఓఆర్‌ఎస్ ద్రావణ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలున్నారు.

విజ్ఞానం పెంచేవే గ్రంథాలయాలు

చీరాల అర్బన్: విజ్ఞానాన్ని పెంచే గ్రంథాలయాలను అంతా సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం పాఠశాల విద్యార్థులకు నీతికథలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు, జాతీయ నాయకులు జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలను పుస్తక పఠనం చేయించారు. ఫ్యాకల్టీ కె.మోహన్‌చే ఇంగ్లిషు గ్రామర్ తరగతులు నిర్వహించారు. అనంతరం పిల్లల మానసిక ఆనందం కోసం పలు రకాల ఆటలు ఆడించారు. కార్యక్రమంలో 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యలో రాణించాలి



కబడ్డీ క్రీడాకారులతో డీఎస్పీ అన్నూ వేణుగోపాల్

చినగంజాం: గ్రామీణ క్రీడాకారులు క్రీడలతో పాటు విద్యలో కూడా రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలంగాణ డీజీపీ కార్యాలయ డీఎస్పీ, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు అన్నూ వేణుగోపాల్ అన్నారు. చినగంజాం ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలలో శ్రీ బాలకోటేశ్వర కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణ తరగతులను బుధవారం సాయంత్రం ఆయన సందర్శించి క్రీడాదుస్తులను సమకూర్చారు. శ్రీ బాలకోటేశ్వర కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి మే 31 వరకు సుమారు 60 మంది గ్రామీణ క్రీడాకారులకు క్లబ్ ప్రెసిడెంట్ ఎం. గిరిబాబు ఆధ్వర్యంలో కబడ్డీలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు డీఎస్పీ వేణుగోపాల్ ఆయన సొంత నిధులతో క్రీడాదుస్తులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కబడ్డీ జట్టుకు చినగంజాం కేరాఫ్ అడ్రెసుగా మారిందని గత కొద్ది సంవత్సరాలుగా రాష్ట్ర జట్టులోని క్రీడాకారులంతా చినగంజానికి చెందినవారే ఉన్నారన్నారు. కబడ్డీ క్లబ్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఎం. గిరిబాబు కబడ్డీ అభివృద్ధికి చేస్తున్న కృషి కొనియాడదగిన విషయమన్నారు. అంతర్జాతీయ క్రీడాకారుడు శ్రీ బాలకోటేశ్వర కబడ్డీ క్లబ్ ప్రెసిడెంట్ ఎం. గిరిబాబు, కార్యదర్శి బోగిరెడ్డి నాగాంజనేయరెడ్డి, 60 మంది శిక్షణ తీసుకుంటున్న కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదలకు విద్యావరం

- పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య
- ఒకటి నుంచి పదో తరగతి వరకు
- ప్రభుత్వ చర్యలతో హర్షాతిరేకాలు



అద్దంకి: పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు ప్రభుత్వ పాఠశాలలను నాడు –నేడు ద్వారా బలోపేతం చేసింది. మరో వైపు విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి కార్పొరేట్ పాఠశాలల్లోనూ పేద విద్యార్థులకు సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంది. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇదో వరం అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. 12(1)సీ చట్ట ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం నియోజకవర్గంలో పేద విద్యార్థులకు తమ పాఠశాలల్లో ప్రవేశాలు లభించాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బల్లికురవ మినహా మిగిలిన నాలుగు మండలాల్లో 99 మందిని మొదటి జాబితాల్లో ఎంపిక చేశారు. వీరిలో ఎవరైనా ఏదైనా కారణంతో ఆయా సీట్లను ఉపయోగించుకోకుంటే వీరి స్థానంలో దరఖాస్తు చేసుకున్న వారికి సీటు లభిస్తుంది. ఎంపిక చేసిన విద్యార్థుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలకు ప్రాధాన్యం ఇస్తారు.

కేటాయించిన విద్యార్థుల సంఖ్య

మండలం పేరు	ఎంపికైన విద్యార్థులు
అద్దంకి	68
సంతమాగులూరు	5
కొరిశపాడు	25
జె. పంగులూరు	1

పక్కాగా అమలు

గత ప్రభుత్వ హయాంలో విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసింది. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచిత చట్టం అమలుకు నోచుకోలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎవరికీ ఈ చట్టం గురించే తెలియలేదు. పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యను అందించేందుకు 2020-22 విద్యా సంవత్సరంలోనే శ్రీకారం చుట్టింది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారిని ఎంపిక చేసింది. 2024-25 ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో 99 మందిని ఎంపిక చేశారు. తమ బిడ్డలను చదివించే సత్తాలేని ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు ఈ 25 శాతం సీట్లను కేటాయించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల నుంచి లాటరీ తీసి సీట్లు కేటాయించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేశారు. పేద పిల్లలకు విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు సీట్లు దక్కాయి. ఇకపై ఏటా ఇలాగే 25 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించే విధంగా ఈ సంవత్సరమే చర్యలు తీసుకున్నారు. ఒకటో తరగతిలో చేరిన పేద విద్యార్థి పదో తరగతి వరకు అదే పాఠశాల్లో చదువుకునే అవకాశం ఉంటుంది.

పేద విద్యార్థుల పాలిట వరం: గంగాధర్, ఎంఈవో

విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించడం పేద విద్యార్థులకు ఒక వరం వంటిది. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చేసుకున్న దరఖాస్తులు స్వీకరించి, పేద కుటుంబాల విద్యార్థులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, హెచ్‌ఐవీ బదితుల పిల్లలను అర్హులుగా గుర్తించాం.

చెత్తను తొలగించే సిబ్బంది వచ్చారు!



మాధవస్వామి గుడి బజారులో పేరుకుపోయిన చెత్తా, చెదారం (ఫైల్)



మాధవస్వామి గుడి బజారులో పేరుకుపోయిన చెత్తను తొలగించి కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

కారంచేడు: సంపన్నుల గ్రామంగా పేరొందిన కారంచేడు ప్రధాన వీధుల్లోని మురుగు కాలువల్లో చెత్తా, చెదారాలు పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 'సాక్షి'లో బుధవారం వచ్చిన కథనానికి పంచాయితీ సిబ్బంది, పాలకులు స్పందించారు. ఈఓపీఆర్డీ ఆర్. రమేష్‌బాబు సూచనలతో గ్రామ కార్యదర్శి బి. శ్రీనివాసరావు వెంటనే తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఏ ఏ ప్రాంతాల్లో చెత్తా, చెదారాలతో మురుగు కాలువలు పూడుకుపోయాయో వెంటనే గమనించారు. వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పురమాయించి క్లీన్ చేయించారు. గత కొన్ని రోజులుగా అవస్థలు పడుతున్నామని, 'సాక్షి'లో వచ్చిన కథనంతో స్పందించిన కార్యదర్శి శ్రీనివాసరావుకి, పారిశుద్ధ్య సిబ్బందికి ఆయా ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బూదవాడలో వేసవి శిక్షణ శిబిరం



వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం బంగారు కొండా

జె.పంగులూరు: మండల పరిధిలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రాంభమైంది. ఈ శిబిరాన్ని పాఠశాల హెచ్‌ఎం బంగారు కొండ ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరం ఉమ్మడి ప్రకాశం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు వారాలు పాటు శిక్షణ ఉంటుందని కోఆర్డినేటర్ పీడీ ఎం. వెంకట్రావు తెలిపారు. వాలీబాల్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. ఆంజనేయులు మాట్లాడుతూ శిక్షణ శిబిరానికి జిల్లా నలుమూలల నుంచి మంచి ప్రతిభ గల 30 మంది బాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి కోచ్‌గా స్పోర్ట్స్ అధారిటీ ఆఫ్ ఇండియా ఆర్ హెయ్ కోచ్ కేవీ రమణ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వాలీబాల్ అసోసియేషన్ ట్రెజరర్ నరసింహారావు, గ్రామ ఉపసర్పంచ గాదే బ్రహ్మారెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ ఈమని శ్రీరాముల రెడ్డి, గ్రామ పెద్దలు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, ఈమని బలరామిరెడ్డి, బుల్లిరెడ్డి, రాఘవరెడ్డి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు చోడా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న గ్రామ పెద్దలు

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

చీరాల టౌన్: వేసవికాలం దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీల్లో ప్రధాన కేంద్రాల్లో విధిగా మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శోభారాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవికాలం సందర్భంగా మండలంలోని 15 గ్రామాల్లోని గ్రామానికి 5 చొప్పున మంచి నీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కార్యదర్శి తమ గ్రామంలో ఈ కేంద్రాలను ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. అలానే ఇంటి పన్నుల వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. పాత బకాయిలను త్వరగా వసూళ్ల చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉండి ఆమోదం పొందిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి సెక్రటరీలు బాధ్యతగా పని చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు మాధవి, ఇమ్రాన్, గౌసియా, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

యద్దనపూడి: లాఠీలు ఝళిపించటం, కఠిన పదజాల ప్రయోగం ఖాకీ బట్టలకే సొంతమన్న భావన ప్రజల్లో పెద్దఎత్తున నాటుకు పోయింది. అలాంటి భావన తప్పని పోలీసులు అంటే సేవాతత్పరులు, ఆదుకునే వారు అనే రీతిలో యద్దనపూడి పోలీసులు దూసుకు వెళ్తున్నారు. నిత్యం తుపాకులు, లాఠీలతో కనిపించే పోలీసులు బుధవారం మండలంలో పలుగులు, పారలతో దర్శనమిచ్చారు. యద్దనపూడి, జాగర్లమూడి గ్రామాల మధ్య నిత్యం టిప్పర్లు తిరగటంతో రోడ్లు అక్కడక్కడ గుంటలు, రోడ్డు ఇరువైపులా చెట్లు ఉండటంతో చిల్లచెట్లను తొలగించి, కుంగిపోయిన రోడ్డును గ్రావెల్‌తో చదును చేశారు. ఎస్సై గరికపాటి వెంకటేశ్వరావు తన సిబ్బంది సాయంతో శ్రమదానం చేసి శభాష్ అనిపించుకున్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



విశేష అలంకరణలో లక్ష్మీ నరసింహ స్వామి

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశింగరకొండ లక్ష్మీ నరసింహస్వామి జయంతి కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. దానిలో భాగంగా విశేష అలంకరణ, కల్యాణ మహోత్సవం, తరువాత హాజరైన భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఈఓ కోటిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉన్నత చదువులతో భవిష్యత్‌కు భరోసా

కారంచేడు: పేద విద్యార్థులు తాము కష్టపడి చదువుకొని ఉన్నత విద్య అభ్యసిస్తే ఆ చదువు వారి భవిష్యత్తును పూర్తిగా మార్చి వేస్తుందని ప్రకాశం డ్వామా పీడీ టి. రవికుమార్ అన్నారు. బుధవారం కారంచేడు మాదిగపల్లి బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో ఆనంద ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్య, ఉద్యోగాల సదస్సు, అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ టీవీ స్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ దృష్టి మొత్తం ఉన్నత చదువులపైనే ఉంచి చదువుకుంటే వారి భవిష్యత్తుకు ఢోకా ఉండదన్నారు. ఉన్నత విద్యతో మంచి, ఉద్యోగాలు, భవిష్యత్తు ఆనందంగా, సంతోషంగా ఉంటుందన్నారు. వారు మరికొందరికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ఉన్నత విద్య పేదరికాన్ని సైతం పారదోలుతుందన్నారు. తల్లిదండ్రులు కష్టపడి చదివించడంతోనే తాను ఈ స్థాయిలో ఉన్నానన్నారు. ప్రతి విద్యార్థి ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అనంతరం అక్కడ ఉన్న విద్యార్థులకు నిర్వహించిన టెస్ట్‌లో మంచి మార్కులు సాధించిన వారికి స్థానిక చర్చి పాస్టర్ బహుమతులను అందించారు. చీరాల మండల మాజీ వైస్ ఎంపీపీ దుడ్డు భాస్కరరావు, వాడరేవు ప్రధానోపాధ్యాయుడు టి. రవిప్రసాద్, టి. భూలక్ష్మి, దుడ్డు మోషే, టి. జీవన్‌బాబు, తేళ్ళ పెద్ద ఇస్సాకు, ఏరువాక సుధాకర్, టి. నారాయణ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన విద్యతో గమ్యం



పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

చీరాల రూరల్: నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికా బద్ధంగా చదివితే తప్పకుండా గమ్యం చేరుకోవచ్చని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎంఎల్‌జే కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత గ్రూప్–2 మెయిన్స్ శిక్షణ తరగతులను బుధవారం సందర్శించారు. అభ్యర్థులు నోటిఫికేషన్లు ఉన్న ఉద్యోగాల కోసం పోటీ పడడమే కాకుండా ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాల గురించి చర్చించుకుంటే అవగాహన పెరుగుతుందన్నారు. 500 పేజీలు కలిగిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర అనే పుస్తకాన్ని ఉచితంగా అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, పుల్లగుర జయశీలరావు, వి. భగవాన్ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసాద్ సేవలు మరువలేనివి

కారంచేడు: పోస్టల్ శాఖలో పసుపులేటి ప్రసాద్ అందించిన సేవలను కారంచేడు ప్రజలు ఎప్పటికీ మరువలేరని చీరాల పోస్టాఫీసు సహాయ కార్యనిర్వహణాధికారి శివరామకృష్ణ అన్నారు. గత 40 సంవత్సరాలుగా కారంచేడు గ్రామంలో ప్రసాద్ పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వహించి ఈ నెలలో ఉద్యోగ విరమణ చేయడం పోస్టాఫీసు సిబ్బందితో పాటు, గ్రామస్తులు కూడా బాధ పడుతున్నారన్నారు. గ్రామంలో పోస్టుమ్యాన్‌గా ప్రసాద్ అందరికీ సుపరిచితులు. గ్రామంలో ఏ మూలన ఉత్తరం వచ్చినా ఫలానా అని చెప్పగలరు. ఎంతో మందికి మంచి వార్తలను, ఉద్యోగ నియామక పత్రాలను, ఇతర దేశాలకు వెళ్ళేందుకు అవసరమైన పాస్‌పోర్టు, వీసాలను సైతం ఆయన చేతుల మీదగా అందించారన్నారు. రిటైర్‌మెంట్‌ను పురస్కరించుకొని బుధవారం స్థానిక పోస్టాఫీస్‌లో ప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు. స్థానిక పోస్ట్ మాస్టర్ రావూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల సర్వే

చీరాల అర్బన్: మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం భవిత కేంద్రం అందుబాటులో ఉందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంఈఓ–2 సుధారాణి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో అంగవైకల్యం ఉన్న విద్యార్థులను గుర్తింపునకు భవిత కేంద్రం సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. 18 సంవత్సరాల్లోపు కలిగిన వారిని గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వే ఈనెల ఒకటో తేదీ నుంచి జరుగుతుండగా బుధవారం ఎంఈఓ పరిశీలించారు. సర్వేలో గుర్తించిన పిల్లలను పరిశీలించి వారి తల్లిదండ్రులకు ఆ పిల్లలకు సంబంధించిన విద్యాబుద్ధులు నేర్పించేందుకు భవిత విద్యా కేంద్రంలో విద్యావసరులు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్స్, విద్యాబోధన భవిత కేంద్రంలో అందుబాటులో ఉందన్నారు. అలానే ప్రత్యేకంగా ఉపాధ్యాయులున్నారన్నారు. పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించి పిల్లలకు విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు డి.రాజశేఖర్, వి.నరసింహం ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

చీరాల అర్బన్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం 216 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వేటపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వెదుళ్ళపల్లికి చెందిన సుబ్బారెడ్డి ఒంగోలు నుంచి చీరాల వైపు 216 జాతీయ రహదారిపై వస్తుండగా మరో బైక్‌పై చీరాల నుంచి ఒంగోలు వెళుతున్న విన్నకోట శ్రీకాంత్, కె. శ్రీకాంత్ వేటపాలెం మండలం అక్కాయిపాలెం జంక్షన్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెదుళ్ళపల్లికి చెందిన సుబ్బారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం క్షతగాత్రుడిని గుంటూరు తరలించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

పర్చూరు (చినగంజాం): మండలంలోని నూతలపాడులోని ఆశ్రయ వృద్ధాశ్రమంలోని బుధవారం పర్చూరు రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు దుస్తులు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. నాగబైరు శ్రీనివాసరావు కుమారుడు వంశీకృష్ణ, కోడలు గాయత్రి వివాహ వార్షికోత్సవం సందర్భంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, పి. సదానందరెడ్డి, భవనం రాజగోపాలరెడ్డి, కారుమూడి సుబ్బారెడ్డి, పాబోలు వెంకన్న పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా కార్డెన్ సెర్చ్

చీరాల: ఎన్నికల కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు టూటౌన్ సీఐ సోమశేఖర్ అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శృంగారపేటలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. టూటౌన్ సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, స్పెషల్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. శృంగారపేటలోని ప్రతి ఇంటినీ సోదా చేశారు. ఇంటి ఆవరణలో పెట్రోలు, డీజిల్, కర్రలు, రాళ్ళు లాంటివి ఏమైనా ఉన్నాయేమోనని సెర్చ్ నిర్వహించారు. రౌడీ షీటర్లకు ఇంటి వద్దనే కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున, తర్వాత శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఎవరైనా పోలీసు ఉత్తర్వులు ఉల్లంఘిస్తే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్ తెరుస్తామన్నారు.



ఇంటిలో సోదాలు నిర్వహిస్తున్న సీఐ సోమశేఖర్

చీరాల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం చీరాల ఒన్‌టౌన్, రూరల్ పరిధిలోని గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు విద్యబోధన

అద్దంకి: ప్రత్యేక అవసరాల పిల్లలకు సాధారణ పిల్లల వలే విద్యాబోధన చేసేందుకు వారిని జూన్ 9 వరకు గ్రామాల్లో పర్యటించి గుర్తిస్తున్నట్లు ఎంఈఓ గంగాధర్ బుధవారం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దాని కోసం ఇంటింటి సర్వే ద్వారా వినికిడి లోపం, దృష్టి లోపం, బుద్ధి మాంద్యంతో పాటు 21 రకాల లక్షణాలు కలిగిన పిల్లలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లలు ఎక్కడైనా ఉంటే వ్యక్తిగతంగా సమాచారాన్ని సేకరించడం జరుగుతుందని చెప్పారు. ఎంఈవో–2 సుధాకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎండల్లో జాగ్రత్తలు పాటించండి

బల్లికురవ: ఎండలు దృష్ట్యా వృద్ధులు చిన్నారుల ఆరోగ్యంపట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రవితేజ కోరారు. బుధవారం నక్కబొక్కలపాడు గ్రామంలో 104 క్యాంపులో భాగంగా బాలింతలు, గర్భిణులు, వృద్ధులకు వివిధ రకాల పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. సాయంత్రం క్యాంపునకు రాలేని వృద్ధులు, చిన్నారులను ఇంటికి వెళ్లి పరీక్షించారు.
వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ప్రకృతి సిద్ధంగా దొరికే తాటిముంజలు తినాలన్నారు. శీతలపానీయాలు ఆరోగ్యానికి అంత మంచివి కావన్నారు. అత్యవసరమైతే ఎండ సమయంలో తగు జాగ్రత్తలతో బయటకు రావాలన్నారు.

జనన, మరణ వివరాలు నమోదు చేయాలి

చీరాల అర్బన్: జనన, మరణాలకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి గత ఏడాది అక్టోబర్ నుంచి అమల్లోకి వచ్చిన నూతన విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పట్టణంలోని ప్రైవేటు హాస్పిటల్స్ డాక్టర్లు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు.

వల్లాపల్లి ట్రస్ట్ నుంచి కుర్చీల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉంచిన కుర్చీలు

బల్లికురవ: మండలంలోని వల్లాపల్లి గ్రామంలోని ట్రస్ట్ నుంచి బుధవారం 15 కుర్చీలు పంపిణీ చేశారు. బల్లికురవలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు గ్రామంలోని నిరుపేదలైన వృద్ధులకు కాసేపు కూర్చొని స్వేద తీరేందుకు కుర్చీలను అందజేశారు. ఇటీవల విద్యుత్ శాఖ కార్యాలయానికి పనిమీద వెళ్లటంతో కూర్చోటానికి కుర్చీలు లేకపోవటాన్ని గమనించి అందజేసినట్లు చెప్పారు. ట్రస్టు బాధ్యులు బాదం రామచంద్రరెడ్డి రామకృష్ణారెడ్డిలను గ్రామస్తులు అభినందించారు.

అధికారుల బదిలీ అన్యాయం

అద్దంకి రూరల్: కుల వివక్షతతో అధికారులను బదిలీ చేయటం సమంజసం కాదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్ బాబు అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జరిగిన సంఘటలను పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ అధికారులనే వివక్షపూరితంగా సస్పెండ్ చేయటం, బదిలీలు చేయటం జరిగిందన్నారు. పల్నాడు కలెక్టర్ శివశంకర్‌ది ఏ తప్పూ లేకపోయిన విధులకు దూరం చేశారన్నారు. చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, తెలగతోటి రాధకృష్ణమూర్తి, కొమ్మాలపాటి బుజ్జిబాబు, మంచుహనుమంతరావు, కోప్పోలు విశ్వతేజ పాల్గొన్నారు.